ప్రజలకు అండగా ఉంటాం

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి సీతారాంబాగ్ ఆగాపురా ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్ గురువారం పర్యటించారు. నగర మాజీ మేయర్, మెహిదీపట్నం కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు. ప్రజలకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్ అన్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తేవాలని సూచించారు. నిరంతరం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండిసమస్యలను పరిష్కరిస్తున్నాన్నారు
– మెహిదీపట్నం, అక్టోబర్ 12

మౌలిక వసతుల కల్పనకు కృషి

లంగరహౌస్ డివిజన్ మొగల్‌నగర్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్

మెహిదీపట్నం, అక్టోబర్ 12: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్అన్నారు. లంగరహౌస్ డివిజన్ మొగల్‌నగర్ ప్రాంతంలో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా వీడీసీసీ రోడ్ల నిర్మాణం కోసం స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి వజీఉజ్జమా సిద్ధిఖి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఆహ్వానం

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు రావాలంటూ ఆర్యవైశ్య సంఘం జాతీయ నాయకుడు, పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం కలిసి ఆహ్వానాన్ని అందించారు. అధ్యక్షులు బాబురావుతో పాటు నాయకులు వెంకటేష్ గుప్తా, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
–మెహిదీపట్నం, అక్టోబర్ 12

పైప్‌లైన్ పనులు పరిశీలన

నాంపల్లి నియోజకవర్గ మల్లేపల్లి డివిజన్ జెడ్‌కేఫ్ చౌరస్తా సమీపంలో 600 ఎంఎంఎ ఎన్‌పీ3 పైపుల నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. దీని కోసం గాను గురువారం తెల్లవారుజామున మల్లేపల్లి జెడ్ కేఫ్ చౌరస్తాలో పైపులను దించారు. ఈ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్ ఖాన్ పర్యవేక్షించారు. –మెహిదీపట్నం, అక్టోబర్ 12

సంగీత గురువులకు సన్మానం

సాయిబాబా, రామాచారిలను సత్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 12. సంగీతంపై ఆసక్తి ఉన్న చిన్నారులను గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దుతున్న గురువులను సత్కరించుకోవడం సముచితమని వక్తలు అన్నారు. కలహంసి ఆర్ట్స్, సత్కళాభారతి సాంస్కృతిక సంస్థల సంయుక్తాధ్వర్యంలో లలిత సంగీత గురువులు పి.వి సాయిబాబా, కె. రామాచారిలకు వడ్డేపల్లి కలహంసి ప్రతిభా పురస్కారాలతో గురువారం సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గల ఆడిటోరియంలో ఘనంగా సత్కరించారు. లలిత గీతాల రచయిత, పరిశోధకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు,ఆకాశవాణి కేంద్ర డైరెక్టర్ వి.ఉదయశంకర్, సీనియర్ పాత్రికేయులు బైస దేవదాసు తదితరులు పాల్గొని లలిత గీతాల ప్రాచుర్యానికి పురస్కారగ్రహీతలు చేస్తున్న కృషిని కొనియాడారు. కళహంసి సంస్థ కార్యదర్శి డాక్టర్ కె.వి రమాకాంత్‌రావు, సత్కళాభారతి అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు. వడ్డేపల్లి కృష్ణ రచనలోని ఆణిముత్యాల్లాంటి లలిత గీతాలను రామాచారి తన శిష్య బృందంతో ఆలపించి సంగీతప్రియులను ఆకట్టుకున్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రమేశ్‌కు చోటు

సర్టిఫికెట్‌ను అందజేస్తున్న తెలుగు వర్సిటీ వీసీ కిషన్‌రావు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 12. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చిత్రలేఖనం కోర్సు పూర్తి చేసిన రమేశ్ బైరు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందుడి అతిపెద్ద అవుట్‌లైన్ డ్రాయింగ్ గీసినందు కు గాను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య టి. కిషన్‌రావు గురువారం తన చాంబర్‌లో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రశంసా పత్రాన్ని రమేశ్‌కు అందజేసి అభినందించారు. పికాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ద్వారా స్వామి వివేకానందుడిని స్ఫూర్తిని ప్రజలలో నింపడానికి తన వంతు ప్రయత్నంగా గీసిన చిత్రానికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుకు ప్రతినిధులు డాక్టర్ జి.వి.ఎన్.ఆర్.ఎస్.ఎస్.ఎస్ వరప్రసాద్, డాక్టర్ పావని ఎంపిక చేసి సర్టిఫికెట్‌ను అందించినందుకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రిన్సిపాల్ పరమేశ్వరి

చార్మినార్, అక్టోబర్ 12 : ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటిచెబుతూ ప్రత్యేకతను చాటుకుంటున్నారని ఫలక్‌నుమా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పరమేశ్వరి అన్నారు. గురువారం కాలేజీ ఆవరణలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్–డెల్ టెక్నాలజీస్ సహకారంతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పరమేశ్వరి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో అందివస్తున్న కోర్సులపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. జీవిత ఉన్నతి కోసం ఏ కోర్సులు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందో గుర్తించాలన్నారు. నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే నేర్చుకునే తత్వం అలవడుతుందన్నారు. కాలేజీలో ప్రత్యేకంగా లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్–డెల్ టెక్నాలజీస్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో విద్యార్థులకు మెరుగైన కోర్సులు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.డిగ్రీ కోర్సులు పూర్తయ్యేసరికి విద్యార్థులు నైపుణ్యంతో కాలేజీ బయట అడుగుపెట్టి జీవితంలో ఆర్థికంగా ఎదిగేందుకు అవరసమైన కోర్సులను అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అనంతరం కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆమె సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వసంతకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో కార్డన్ సెర్చ్

మెహిదీపట్నం, అక్టోబర్ 12 : లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో సుమారు 200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సరైన నంబర్ ప్లేట్లు, చలాన్లు లేని 35 ద్విచక్ర వాహనాలతో పాటు రెండు త్రీ వీలార్, ఒక ఫోర్ వీలార్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు బెల్ట్‌షాపులపై రైడ్ నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలక్షన్‌లు సమీపిస్తుండటంతో లైసెన్స్ రివాల్వర్లు ఎవరి వద్ద ఉన్నాయో అవి సంబంధిత పోలీసులకు అప్పగించి రశీదు తీసుకోవాలని గోల్కొండ ఏసీపీ ఫయాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నీరంజన్‌రావు, అదనపు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐ పాల్గొన్నారు.

లంగర్‌హౌస్ ప్రశాంత్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రేపు న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 12 : న్యాయవాదుల పరస్పర సహకార సంఘం రజతోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14, 15వ తేదీల్లో న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసినట్టు అధ్యక్షుడు ఆలుగడ్డల అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కోర్టుల నుంచి 14 జట్లు టోర్నమెంట్లో పోటీ పడనున్నాయని, విజేత జట్టు ట్రోఫీని అందుకుంటుందన్నారు. న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘం స్థాపించబడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రజతోత్సవాన్ని జరుపుకుంటున్నదని తెలిపారు. ఇందులో భాగంగానే న్యాయవాదుల క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. జంట నగరాల్లోని అన్ని కోర్టులకు చెందిన న్యాయవాదుల క్రికెట్ జట్లు ఈ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొననున్నాయని, ఈ పోటీలను సొసైటీ నిర్వహిస్తున్నదన్నారు. ఈ పోటీలను ఏవైఆర్ క్రికెట్ మైదానం, బీవీ రెడ్డి నగర్, ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. అన్ని బార్ అసోసియేషన్లకు చెందిన జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమానికి నాంపల్లి కోర్టుల జిల్లా జడ్జిలు ప్రేమావతి, రమాకాంత్, సాయిభూపతి ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు తెలిపారు. నాంపల్లి డైరెక్టర్ మహేశ్, సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ పద్మనాభ నగర్‌కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కుల్సుంపురా ఏసీపీ ఎంఏ జావిద్ విచ్చేసి మాట్లాడుతూ తాము నిరంతరం ప్రజల సేవ కోసం పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కుల్సుంపురా ఏసీపీ ఎంఏ జావిద్‌తో పాటు గుడిమలాకపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ముజీబ్ రహమాన ఎస్ఐ జ్యోతి, కాలనీ వాసులు మహ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.
–మెహిదీపట్నం, అక్టోబర్ 12

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ ఎల్ఐసీ కాలనీలో సీవరేజీ పొంగిపొర్లుతుండటంతో స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు గురువారం సీవరేజీ పనులను చేపట్టి సమస్యను పరిష్కరించారు. ఈ పనులను ఎంఐఎం నాయకులు సమీ ఉల్లా చాంద్ పర్యవేక్షించారు. –మెహిదీపట్నం, అక్టోబర్ 12